# సాలెగూడు

ఆకాశవీధిలో స్వేచ్ఛగా ఎగురుతోన్న పాలపిట్టల దండొకటి అవాక్కయి ఆగి చూసింది. తాము మామూలుగా ఎగిరే ఎత్తులో ఆకాశాన్నంటుతూన్న ఆ భవంతుల్ని చూసి విస్తుబోయి వెనుదిరగబోయి, మళ్ళీ ఆ వైభవాన్ని చూడాలన్నట్లుగా మరింత పైకెగిరింది.

పెద్దపెద్ద గాజుకిటికీలతో కూడిన అందమైన భవంతులూ, ఆ కిటికీల్లో నుండి వెదజల్లబడి మిరిమిట్లు గొలుపుతున్న నియాన్‌లైట్ల కాంతి, ఆ భవంతుల్ని ఒక పద్ధతిలో బారులుబారులుగా చీలుస్తూ తెల్లటి, నున్నటి సిమెంటురోడ్లూ, వాటికిరువైపులా పూలగుత్తులతో కూడిన పేరు తెలీని క్రోటన్‌మొక్కలూ, ఆ రోడ్లమీద అటు ఇటు ఎటువంటి శబ్దకాలుష్యమూ లేక పరిగెడ్తూన్న పడవల్లాటి విదేశీకార్లూ, ఆకాశహర్మ్యాల మీదుగా సాగుతోన్న విమానాలూ.

ఆ భవంతి లోపలభాగం ఎప్పుడో కురుక్షేత్రం సినిమాలో చూసిన మయసభని గుర్తుకు తెస్తోంది. చిన్నపిల్లలా

ఎగిరి గంతేయాలన్న కోరికని అతిబలవంతం మీద ఆపుకుంటూ మెల్లిగా పైకెక్కడం మొదలుపెట్టాను.

పై అంతస్థుమీది నుండి చూస్తూంటే చుట్టూ కనుచూపుమేర దాకా అన్నీ ఆకాశ హర్మ్యాలే తప్ప ఎక్కడా చిన్న పెంకుటిల్లు లేదా పూరిళ్ళు కన్పించడంలేదు. పేదరికాన్ని తొలగించేశారో లేక రాత్రికిరాత్రి పేదవాళ్ళంతా ఎక్కడికయినా పంపివేయబడ్డారో అర్థంకావడం లేదు. "ప్చ్" నాలుకెగరేస్తూ, అనవసరపు ఆలోచనల్లోకి జారకుండా ఆ స్వర్గాన్ని అనుభూతించడంలో మునిగిపోయాను.

* * *

ఎక్కడో ఎవరో ఏడుస్తోన్న శబ్దం నా కలల దారాల్ని తెంపింది. ఎవరో ఏడుస్తున్నారు పెద్దగానే. భయమో, బాధో, ఏళ్ళ సహనాన్ని ఎవరో తూట్లు పొడిచినట్లుగా... చిక్కనిచీకట్లు తొలగి వెలుగురేఖలేవో ప్రసరించినట్లు అస్పష్టంగా రేఖలు రూపాన్ని సంతరించుకున్నాయి.

నేనెక్కడున్నదీ నాకు చప్పున స్ఫురించలేదు .

"అమ్మా.... ఏడవొద్దమ్మా... కొత్తవాళ్లు యింట్లో వున్నప్పుడు మనం ఏడిస్తే ఏం బావుంటుంది చెప్పు?" ఎవరో ఓదారుస్తున్నారు దుఃఖాన్ని. అది ఓదార్పో లేక పరాయివాళ్ళ ముందు బయటపడ్తున్నందుకు విసుగో అర్థంకావడం లేదు.

"అవునమ్మా... భాస్కరన్న ఫ్రెండొచ్చింది. మనకిదేం ఈరోజు కొత్తకాదు గదా ఏడవ బాకమ్మా" భాస్కర్ చెల్లెలు తల్లికి నచ్చచెప్తోంది.

అయినా అమ్మ ఏడుపాపలేదు .

ఒక వేదన, ఒక తపన, ఏళ్ళ తరబడి లోపల దాగి ఊపిరాడకుండా వుండిపోయిన దుఃఖమేదో బయటదారి వెతుక్కుంటున్నట్లుగా వుందామె రోదన.

కడుపులో దేవినట్లుగా అయింది .

మనుషులిలా రోదిస్తారా? ఎవరయినా ఆత్మీయులు పోయినపుడో, ఆస్తులు ఓడిపోయినపుడో, పెద్ద దెబ్బతగిలినపుడో, మనుషులు కళ్ళనీళ్ళు పెట్టుకోవడం తెలుసుగానీ, యిటువంటి దుఃఖపు పొరలు నాకిదివరకెన్నడూ పరిచయం లేదు.

"అమ్మా... అమ్మా" పిలుస్తోంది భాస్కర్ చెల్లి కరుణ.

దుఃఖాన్ని అతి ప్రయత్నంమీద ఆపుకోవడానికి ప్రయత్నిస్తోన్న వెక్కిళ్ళతో "ఈ నెల నేనేం జేసేదిరా భాస్కరా?" అంది అమ్మ.

"ఎట్టోకట్ట జరగతాది లేమా నువు లెయ్యి... ఏడవబాక"

"అమా నువ్వేడవబాకమా... నాక్కూడా ఏడుపొస్తుండాది" కరుణ గొంతులో దుఖపుజీర.

"ఒరే ఏందిరా అందరూ... ఇంట్లో ఏందో శవం లేసిపోయినట్లు ఆ ఏడుపులేంది, ఆ అరుపులేంది? యిప్పుడేం జరిగి పొయ్యిందని. ఇంట్లోకి యింతకాలానికి ఒక టి.వి. తెచ్చు

కున్నాము. అదిగూడా ధరలు తగ్గుండాయికదాని తెచ్చినాను. దానికి యింత రాద్ధాంతం చెయ్యాలా?'' భాస్కర్ తండ్రి కిష్టయ్య అందర్నీ గదమాయించాడు.

కరుణ సర్రున పైకి లేచింది .

"లేదు నాయినా... టి.వి. తెచ్చుకోవడం తప్పుగాదు. ఎటొచ్చీ కృపత్తకాడ అమ్మ అప్పు చేసి తెచ్చిన డబ్బుల్తో టి.వి. కొనడం మాత్రం తప్పే. టి.వి.ల ధరలు తగ్గినాయని నువ్వంటుం డావు... నిజమే... యిక్కడ రేషను బియ్యం, కిరసనాయిలు, ఉప్పులూ, పప్పులూ అన్నిటి ధరలూ పెరిగిపోయినాయి. మనకి యియ్యి ముఖ్యంగానీ టి.వి.లు, ఫ్రిజ్జులూ కాదుగద నాయినా...

అదెట్టన్నా బొయ్యింది... పండగ నెలొస్తుండాది గదాని, ఈ నెల్లో అయితే బాగా బేరాలుంటాయని అమ్మ అప్పుచేసి నీకాడ డబ్బులిచ్చి పంపింది... కొత్తరకాల చీరలు నేస్తే పదిరూపాయలొస్తాయి కదా... ఒక చిన్న అప్పన్నా తీర్చుకుందామని ఆశపడింది. అట్టాటిది నూలు తెమ్మని అమ్మ డబ్బులిస్తే నువు టి.వి. తేవడం తప్పుగాదా'' ఆక్రోశంతో కొంచెం పెద్దగా మాట్లాడ్డం మూలంగా కరుణ గొంతు పీలగా అయి దుఃఖంలోకి దిగింది. ఆ దుఖంలోని అనేకానేక అర్థాలనీ, దిగుళ్ళనీ కప్పిపుచ్చుకోవడం కోసం ధైర్యాన్ని అరువు తెచ్చుకుంటోందామె.

అమ్మ ఏడుస్తూనే వుంది సన్నగా... "నేనా కృపమ్మకి ఏం చెప్పేదిరా దేవుడో'' అంటూ.

"ఏదో ఒకటి చెప్తాంలేయే... మొగుడు చచ్చినట్లు ఏడవబాక. ఏదో ఆ పెద్దింటి ఆడపిల్ల మనోడ్ని ప్రేమించానంటూ వచ్చింది. మనింట్లో కూర్చోను రెండు కుర్చీలు, టి.వి. తెచ్చినాను. అదిగూడా తప్పంటనే... అసల్నీకెందుకే... ఆ రాజారెడ్డి బిల్లులొస్తానే నాకు యాభయి వేలిస్తానన్నాడు. ఆ డబ్బుల్దెచ్చి ఈ అప్పులన్నీ తీర్చేస్తాన్లేయే'' నిర్లక్ష్యంగా అని కిష్టయ్య బయట వసారాలోకి వెళ్ళిపోయాడు పైగుడ్డ చేతిలోనికి తీసుకుని విదిలించుకుంటూ.

"చూస్తుండావు గదా భాస్కరా... టి.వి. వుంటేనే ప్రేమిస్తాదంట్రా ఆయమ్మి నిన్ను... ఈ చిన్నప్పులన్నీ దీర్చడంకోసం పెద్దప్పు చేస్తాడంట... ఎట్ట జేసేదిరా మీ నాయన్తో... ఎల్లకాలం యియ్యే బాధలుగదా... చేతలో అంత పని బెట్టుకుని నాలుగు కోకలు నేసుకుందామని లేకుండా బతికినంతకాలం యిట్నే అప్పులు అప్పుల్లో గడిపేస్తినే...'' చిన్న పిల్లాడు పారేసుకున్న వస్తువుని గుర్తుతెచ్చుకుని గుర్తుతెచ్చుకుని ఏడుస్తున్నట్లుగా వుందామె .

"అదేందిమా అట్టంటావు? నాయిన మాదిరి నేతగాళ్లు ఈ ఆరు మండలాలకి లోపల ఎవరుండారో ఒకర్ని చూపించు. కాకుంటే నేతచీరలు అడిగేవాళ్ళు లేక అట్టయిపోయినాడు గాన్యా'' తండ్రి పనితనాన్ని, తండ్రి చేతిలో తీరిన చీరల గొప్పతనాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటోంది కరుణ.

నాకు చప్పున ఆ ముందురోజు సాయంత్రం కరుణ చూపించిన చీరలు గుర్తొచ్చాయి. వాటిలోని నైపుణ్యం, అందం, వాడిన నూలు, ఆ చీరల డిజైన్లు రూపొందించిన తన తండ్రి గురించి కరుణ వైనవైనాలుగా చెప్పడం గుర్తొచ్చింది.

నిజమే చేతిలో యింత పనితనమున్న వ్యక్తి, ఈ నాలుగ్గోడల నడుమా, ఈ పల్లెటూర్లో అనామికంగా... ప్చ్...

బయట అరుగుమీద గొంతుక్కూచుని వీధికేసి దృష్టి సారించి, బీడీ పీలుస్తూ తనలో తాను గొణుక్కుంటోన్న కిష్టయ్యకేసి నిశితంగా చూశాను.

కాసేపటికి అమ్మ దుఃఖం కొంత ఉపశమనాన్ని పొందింది.

నేను అప్పుడే నిద్రలేచినట్లుగా చాపమీద లేచి కూర్చున్నాను. ఎడమ అరిచేతిని అడ్డం పెట్టుకుని రాని ఆవులింతని ప్రదర్శించాను.

“గుడ్‌మార్నింగ్ వర్షా” తల్లి వద్దనుండి పైకిలేస్తూ పలకరించాడు భాస్కర్. కరుణ కూడ నాకేసి చూసి పలకరింపుగా నవ్వింది. అమ్మ చివరగా మిగిలిన కన్నీళ్ళని తుడుచుకుంటూ వెనక వసారాలోకి వెళ్ళింది చుట్టానికి కాఫీ కలపడం కోసం కాబోలు... ఆమెను చూస్తుంటే నాకెందుకో ఆశ్చర్యంగాను, జాలిగానూ అన్పించింది .

మన ఆంధ్రదేశంలోకి టి.వి. ప్రవేశించి దాదాపు ముప్పయ్యేళ్ళు గడిచాక యిప్పుడు యింట్లోకి టి.వి. తెచ్చినందుకు భర్త మీద ఆగ్రహంతో వుందామె. తమ యింట్లో ఎప్పట్నుండో కలర్ టి.వి. వుంది. వార్తలు, సీరియల్స్, సినిమాలు, క్రికెట్ అన్నీ క్లాషవుతున్నాయని బెడ్‌రూము లోకి వేరే టి.వి. కొనమని పోరు పెడ్తుంటుంది మమ్మి. సిటింగురూములో సోఫాసెట్టు కాకుండా యింకా వైరుకుర్చీలే వున్నందుకు అసంతృప్తిగా వుంటుందామె. బీరువానిండా చీరలున్నా ఎవరయినా అమెరికానుండి వచ్చారంటే చాలు ఇంపోర్టెడ్ వస్తువుల కోసం వెంపర్లాడుతుంది. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న అల్లుడి కోసం వెతుకుతుంటుంది.

మమ్మీ, అమ్మా యిద్దరూ కూడా తల్లులే.

కాలేజీ చదువులు పూర్తయి ఎవరి జీవితాల్లోకి వాళ్ళు విడిపోవల్సి వచ్చినపుడు ప్రేమ సంగతి బయటపెడితే భాస్కర్ పనిగట్టుకుని నన్నీ వూరెందుకు తీసుకొచ్చాడో కొంచెంకొంచెంగా తెలుస్తోంది.

మెల్లిగా లేచి దుప్పటి మడతేసి పెట్టి వెనక వసారాలోకి వచ్చాను. కట్టెలపొయ్యి మీద కాఫీ కలుపుతోన్న భాస్కర్ తల్లి, బతుకును భారంగా నెడుతోన్న స్నేహితురాలిలా వుంది. ఆమె దుఃఖపు మేఘాల్ని పగలగొట్టి ఎవరయినా ఆనందపు వర్షం కురిపించగలిగితే బావుండు నన్పించింది.

ఆమె అందించిన కాఫీగ్లాసుని పట్టుకుని యాంత్రికంగా వెళ్ళి బావిగట్టున కూర్చున్నాను. కాసేపటికి కరుణ కూడా కాఫీగ్లాసుతో వచ్చి నా ప్రక్కనే చోటుచేసుకుంటూ

“సారీ ... మా యింట్లో మీకు ఇబ్బందిగా వుందనుకుంటాను” జరిగిన సంఘటనకి ఒకింత సంజాయిషీగానూ, నేనెలా స్పందిస్తున్నానో తెలుసుకోవడానికన్నట్లుగానూ పలకరింపుగా నవ్వింది కరుణ.

“అబ్బే అదేంకాదు కరుణా... టి.వి. తెచ్చినందుకు ఆంటీ ఎందుకింత బాధపడ్తున్నారా

అని..." మాటమాట కూడుకుంటూ నసిగినట్లుగా అసలు విషయాన్ని ప్రస్తావించాన్నేను.

రెండు నిముషాల మౌనం తరువాత మాట్లాడింది కరుణ.

"నిజమే ఎందుకూ అంటే... ఆ సంగతి తెలియాలంటే మీకు చాలా తెలియాలి" జీవిత రహస్యాన్నేదో విప్పిచెప్పడానికి సిద్ధపడ్డదానిలా వుందామ్మాయి.

"మా కుటుంబం తాతముత్తాతల నుండీ నేతపని మీదే ఆధారపడి బతుకుతోంది. మా ముత్తాత చేత్తో నేసిన చిలకల చీరలు వేరే దేశాలక్కూడ పంపించేవారంట. మాతాత తను నేసిన చీరల్ని ఎలా అమ్ముకోవాలో తెలీక గూడూళ్ళోని కోమటిశెట్లని అడుక్కుంటే వాళ్లెలా ఈయన్ని మోసంచేసి పెద్దోళ్ళయిపోయారో మానాన్న కతలుకతలుగా చెప్తుంటాడు. అయినా మాకు భుక్తికి లోటుండేదికాదు. ఉండటానికో పెంకుటిల్లుండేది.

మా నాయినమ్మ ఉదయం పదకొండుగంటలకి వాకిట్లో గంప పెట్టుకుని కూర్చునేది. వచ్చినోళ్ళందరికీ లేదనకుండా ఒక యిగరపు ముద్దా, లోటాడు మజ్జిగా పోసేది. ఎక్కడెక్కడి బిచ్చగాళ్ళంతా లచ్చుమమ్మ యింటికి పోతే ముద్ద దొరుకుతాదని ఆశపడేవాళ్ళు. అట్టంతా బతికిన కుటుంబం మాది.

అయితే యిప్పుడు చేనేత పనికి విలువనేదే లేకుండాపోయింది. నేతచీరలడిగేవాళ్ళే అరుదయిపోయారు. కరెంటు మగ్గాలొచ్చి చేతిమగ్గాల నడుములిరిచేస్తే... యిప్పుడింకా వాటి అమ్మా మొగుళ్ళు జెట్ మగ్గాలొచ్చేశాయనుకో... "

ఊపిరి తీసుకోడానికన్నట్లుగా ఆగింది కరుణ.

ఆమధ్య ఆప్కో సంస్థ దివాలా తీసినట్లు, బకాయిలూ చెల్లించక సొసైటీల్లో గుట్టలు గుట్టలు బట్టలు మూలుగుతున్నట్లూ... మొత్తం నేత కార్మికుల జీవితాలే ప్రశ్నార్థకమై పోయి నట్లూ వార్తల్లో చూసిన విషయం గుర్తొచ్చింది నాకు. మనం ప్రతిరోజూ అలవోగ్గా చదివి పక్కకి తిప్పేసే వార్తల వెనక యిన్ని అగాధాలా? బరువెక్కిన గుండె, భావంలేని చూపుల్తో కరుణ కేసి చూడసాగాను.

ఇదేమీ పట్టనట్లుగా కొంచెం ముందుకు వంగి కాఫీ తాగుతోంది కరుణ. ఆమె కళ్ళల్లో చుక్కనీళ్ళు లేవు. గుండెల్లో వూరుతున్నాయేమో తెలీదు.

"ఏవమ్మే కరుణా మీ నాయిన టి.వి. తెచ్చినాడంటనే " పక్కింట్లోని వెనుక వాకిట్లో నుండి చెత్త పారేయడానికి బయటకొచ్చిన రావమ్మ కరుణని పలకరించింది.

"అవునత్తా ..."

"అయినా మీ నాయినకి వయసొచ్చేకొందీ మరీ యిరం పరం లేకుండా పోతుండాది. మొదలు ఈ పూట ఎట్టా గడవపోతాదా బగవంతుడా అని అల్లాడుతుంటే టి.వి. దేనికంట టి.వి..."

చేతిలోని చెత్తపోగుని దూరంగా పారబోసి ఖాళీ చాట పట్టుకుని వూపుకుంటూ, మళ్ళీ కరుణవద్ద కొచ్చిందామె. మాసిన లేతరంగు చేనేతచీర ఒక కొంగు బొడ్లోఎత్తి దోపుకుని

వేలాడుతోన్న పైటచెంగుతో కరుణ మీదికి యుద్ధానికొచ్చినట్లుగా వుందామె .

"అమేఁ నాకు తెలవకడగతా గాన్యా? మీ నాయన్సంగతి చూస్తానే వుండావు గదా. మీ నాయిన్దగ్గరికపోతే నువ్వూ, మీ యమ్మా బొయ్యుండగూడదా... పోనీ భాస్కరుడొచ్చుండాడు గదా వోడ్ని పంపీగూడదా... మీరు గూడా అంతే లేమ్మే" తప్పంతా కరుణదీ, వాళ్ళమ్మదే అన్నట్లుగా అంది.

చప్పున అందుకుంది కరుణ.

"భాస్కరన్న కిట్టాటియన్నీ తెలీదుగదత్తా ..." చుట్టం ముందు ఈ చర్చ కరుణకి నచ్చినట్లుగా లేదు.

"భాస్కరన్న కిట్టాటియి తెలీదు... పెద్దోడు జూస్తే అట్టయిపాయ... వీళ్ళ చదువులకే ఉణ్ణిందంతా ఊడ్చిబెట్టేస్తిరి... నీ పెళ్ళి యాంబెట్టి జేస్తాడంట మీ నాయిన..." గొణుక్కుంటూ చేట తీసుకుని వాళ్ళింటివైపుగా వెళ్ళిపోయింది.

ఆమె వాళ్ళింట్లోకి వెళ్ళేదాకా, సాలోచనగా చూసి ఆ తర్వాత నాకేసి చూసి తిరిగి చిరునవ్వు నవ్వింది కరుణ.

"నిజమే ఒకపక్క పని సరిగ్గా లేకపోవడం, మరోపక్క అన్నల చదువులూ... దీంతో అప్పులు యింతై... అంతై అన్నట్లుగా..." చేతులూపుతూ నవ్వింది కరుణ.

కరుణ నవ్వు చూస్తుంటే ఆశ్చర్యంగా వుంది నాకు. నవ్వు అన్నది బాధ అనే నాణాని కున్న రెండో పార్శ్వమేమో... "మామూలుగా అయితే ఇప్పటి పరిస్థితుల్లో నేతచీరలు అడిగేవాళ్ళు, కొనేవాళ్ళు లేరు. ఇక్కడ గూడూరులో రెడ్డెమ్మలిద్దరు చిలకల జరీచీరలు కావాలని అడిగారు. సరే వెంటనే డబ్బులు చేతిలో పడిపోతాయి కదా, ఒక చిన్న అప్పు తీర్చుకోవచ్చుననుకుంది అమ్మ. పాతప్పు తీరడం పోయి కొత్తప్పు చేరుకుంది" మళ్ళీ నవ్వింది కరుణ. ఆమె నవ్వుని విశ్లేషించడానికి మాటలు వెతుక్కుంటూ నిర్భావంగా చూస్తున్నాను.

"ఇంతకుముందైతే నేసిన చీరలు నిమిషాలమీద మద్రాసెళ్ళిపోయేవి. దళారి బల రామయ్య వచ్చి అందరివద్ద చీరలు తీసుకెళ్ళి పట్నంలో అమ్మి మళ్ళీ వారం డబ్బులిచ్చేసేవాడు. బలరామయ్యకు చీరలమ్మించడంకోసం పని ఊపిరితిరిగేదికాదు. ఊరంతా మగ్గాలమోతతో ఓరెత్తిపోయేది. ఇప్పుడెక్కడా చిన్న శబ్దం కూడా లేకుండా వల్లకాడైపోయింది" కరుణ నవ్వుతూనే లేచి నా చేతిలో గ్లాసందుకుని రెండు గ్లాసులూ బకెట్లోని నీళ్ళలో తొలిచి యింటివైపు తిరిగింది.

"కరుణత్తా... కరుణత్తా టి.వి. బిగించేశారు ... రా చూద్దాం" భాస్కర్ అన్న కొడుకు ఎనిమిదేళ్ళ రాంప్రసాద్ పరిగెత్తుకుంటూ వచ్చాడు... కరుణ కూడ 'హై' అని కేరింతలు కొడుతూ వాడితోపాటు లోపలికి నడిచింది. కోటి రూపాయల లాటరీ తగిలినట్లున్న వారి ఆనందాన్ని గమనిస్తూ నేనూ లోపలి కడుగేశాను.

అప్పటికే చుట్టుపక్కల పిల్లలంతా ఆ రెండు నిట్రాళ్ళ యింటిలో నిండిపోయివున్నారు. భాస్కర్, రాంప్రసాద్‌తో కలిసి సరదాపడ్తూ కొత్తకుర్చీల మీద కూర్చొని వున్నాడు. గాజు ఫలకం

లోంచి దూసుకుపోయిన ధవళ కాంతి రంగురంగులుగా రూపాంతరం చెందినట్లుగా యిల్లు రంగరంగ వైభోగంగా వుంది .

చిన్నతెర మీద బొమ్మ ప్రత్యక్షమైంది .

ఏదో ఫ్రిడ్జ్‌ల కంపెనీ యాడ్ అది. ఫ్రిడ్జ్ తలాడిస్తూ తల్లిలా కుశలప్రశ్నలేస్తోంది యింటి యజమానిని. చిరాకేసింది నాకు. మనిషి యంత్రంలా మారిపోతూంటే యంత్రం మనిషిలా ప్రవర్తిస్తోంది .

ఊపిరాడనట్టయి సోపూ టవలూ పట్టుకుని వెనక వసారాలో కొచ్చాను.

ఆ టి.వి మొహం చూట్టానికి ఏమాత్రం యిష్టపడనిదానిలా పొయ్యిముందు కూర్చుని వంటచేస్తోంది భాస్కర్ తల్లి. ఆ వెలుతురు పడి ఆమె మొహం ఎర్రగా మండుతోంది.

* * *

"వర్షా ఈ కొంచెం వేసుకో" చెప్పాడు భాస్కర్ చికెన్ చేసిన గిన్నె అందుకుంటూ...

"వద్దొద్దు... ప్లీజ్ చాలు" అరిచాన్నేను ప్లేటు లాగేసుకుంటూ.

"మన కూరలు నచ్చలేదేమో" నవ్వింది కరుణ.

నేను మాట్లాడలేదు... చికెన్ 65, జింజర్ చికెన్, చిల్లీ చికెన్... చికెన్ మంచూరియా... ఈ ఒక్క చికెన్‌లోనే పదిరకాల డిషెస్ చేస్తుంది మమ్మీ. నిజానికి వాటితో పోలిస్తే ఈ కూర కాస్త ఇబ్బందిగానే వుంది. ఎన్నో రకాల కేకులు, పుడ్డింగులు, ఐస్‌క్రీములు మమ్మీ చేతిలో కొత్త రుచులు పోతూ నోరూరిస్తుంటాయి.

నేను మమ్మీడాడీలతో కలసి బయటికెళితే తప్పనిసరిగా స్టార్ హోటలే. పిజ్జాలు, బర్గర్లు, హాట్‌డాగ్స్ వాటి పేర్లుకూడా వినివుండరేమో వీళ్ళు.

"నాకు త్రీస్టార్, ఫైవ్‌స్టార్ అంటే ఏమిటో నిజంగా తెలియదు. అంతెందుకూ నేను కాలేజీకొచ్చేదాకా కూడా ఐస్‌క్రీమ్ చూడలేదు. ఇక్కడికొచ్చాక స్నేహితుల ఒత్తిడితో ఫ్రూట్‌సలాడ్ రుచి తెలుసుకున్నాను..."

ఒకసారి మాటల్లో భాస్కర్ చెప్పిన విషయం గుర్తొచ్చింది. పరిచయమైననాటి నుండి భాస్కర్ తన తెలియనితనాన్ని గురించి తెలియజెప్తూనే వున్నాడు. నాకే అర్థమైంది కాదు.

"ఎన్ని దినాలైందమ్మా నువ్విట్లా రాగి సంగటి , కోడికూర చేసి..." లొట్టలేసుకుంటూ తింటోంది కరుణ.

అమ్మ మొహం చాలా పొడవుగా వుంది .

"మీ నాయన్ని పిలవండి" చెప్పిందామె వుండీ వుండి.

నా గుండె వేగంగా కొట్టుకుంది. ఆమె కళ్ళల్లోకి సూటిగా చూశాను. భావాల్ని బయట పడనీకుండా ఆమె కనురెప్పల్ని కిందికి వాల్చివుంది.

ఆత్మగౌరవాలతోనూ, వ్యక్తిత్వాలతోనూ, నిటారైన వెన్నుపూసలతోనూ మమ్మీ, డాడీ తరచుగా మాటామాటా పెంచుకోవడం, ఆ తర్వాత రోజుల తరబడి మౌనయుద్ధం మధ్యన నేను శాండ్‌విచ్‌లా నలిగిపోవడం... యిది మాత్రమే తెలిసిన నేను ఆమెకేసి విస్తుపోయి చూస్తున్నాను.

నిజంగా వీళ్ళెంత గొప్ప ప్రేమికులు.

పెద్దవాళ్ళు ప్రేమని ఎగ్జిబిట్ చేస్తే

పేదవాళ్ళు ప్రేమతో జీవిస్తారు.

వేలంటైన్స్ డే నాడు భాస్కర్ని వెతుక్కుంటూ వెళ్ళి గిఫ్టిచ్చి ప్రేమసంగతి చెప్తే అతనే మన్నాడు

"ఏమిటి వర్షా ఈ పిచ్చిపనులు... కేలండర్ ప్రేమలు... జీవితాన్ని, మనుషుల్నీ అనుక్షణం ప్రేమించేవాడికి ప్రేమికులరోజేమిటి? జీవితాంతం ప్రతీక్షణం కలిసుండే దంపతులకి భార్యలరోజేమిటి? భర్తల రోజేమిటి... విదేశాల్లో అంటే వాళ్ళ కుటుంబంగా కలిసుండేది చాలా తక్కువ. ఎప్పుడో సంవత్సరానికోసారి కలుసుకోవడం కోసం నాన్నలరోజు, మదర్స్ డే అంటూ ఏర్పాటు చేసుకున్నారు. మనం ఎంత గుడ్డిగా వాళ్ళననుకరిస్తున్నామో చూడు... పిచ్చిపిల్లా... "

ఆరోజు భాస్కర్ అన్నమాటల్లో అతడి జడత్వాన్ని మాత్రమే చూశాన్నేను. ఇప్పుడా లోచిస్తుంటే ఆ మాటల్లోని లోతు తెలుస్తోంది.

అమ్మ కేసి, ఆమె వడ్డిస్తూంటే ఆవురావురుమంటూ తింటోన్న ఆమె భర్తకేసి నిశితంగా చూస్తూండిపోయాను.

* * *

మట్టిరోడ్డు మీద కరుణ, నేను కబుర్లాడుకుంటూ నడుస్తున్నాం... ఊరు మొత్తం పొడవాటి ఈ రోడ్డు మాత్రమే. రోడ్డుకు అటూ యిటూ దూరదూరంగా, అక్కడక్కడా ఒక పూరిలు. ఊరంతటికీ కలిపి ఒక చిన్న బంకు. ఊరి చివర గ్రామదేవత గుడి.

మేము ఆరోడ్డు మీద నడుస్తుంటే మనుషులు వింతగా, కొత్తగా నాకేసి చూస్తున్నారు. వాళ్ళు నల్లటి ఎత్తు చెప్పుల్లో పచ్చగా నున్నగా ఉన్న నా పాదాలనీ, నా వంటికి నప్పినట్టుగా వున్న లేత ఆరంజిరంగు చుడీదార్నీ, నా చర్మపు రంగులో కలిసిపోయి కన్పడీ కన్పడకుండా మెరుస్తోన్న బంగారుగాజుల్నీ, నా మొహంలో ఉత్సాహంగా కదుల్తోన్న కళ్ళనీ మార్చిమార్చి చూస్తున్నారు... చూస్తూ వాళ్ళల్లో వాళ్ళే గుసగుసలాడుకుంటున్నారు. బహుశా నా ఎత్తు వాళ్ళ నాకర్షించి ఉండొచ్చు.

నేను హఠాత్తుగా కరుణకేసి చూశాను కొత్తగా. తను నా భుజాలదాకా ఉండి, చామన చాయతో, మ్యాచింగ్ లేని లంగా ఓణీలతో, చెప్పుల్లేని కాళ్ళతో, చాలా సాదాసీదాగా వుంది.

"రాత్రి ఎక్కడినుండో టిక్కుటిక్కు శబ్దాలు వినిపించాయన్నావుగదా... ఇదిగో ఈ ఇంట్లో నుండే ... ఊరంతా పనిమానేసినా ఈ శేషన్నింట్లో, మా యింట్లో అప్పుడప్పుడు ఈ శబ్దాలు... ప్చ్" చెప్పింది కరుణ.

"అవునూ రాత్రిపూట కూడా నేస్తారా?" విస్తుపోయాను నేను.

"అవును, రాత్రివేళల్లోనే ఎక్కువ నేస్తారు... ఎందుకంటే ఆసమయంలో అయితే పోగులు తెగకుండా వస్తుంది నేత... మరీ నూరో నంబరు దారమైతే అమిత సన్నగా వుంటుంది. పోగు తెగిందనుకో అది మళ్ళీ మరో పని... బూడిద చేత్తో వాటిని కలుపుకోవాల్సి వుంటుంది" తెగిన పోగులు ఉరితాళ్ళవుతున్నాయన్నట్లుగా చెప్పింది కరుణ.

"కరుణా, ఒకసారి లోపలికెళ్ళి చూద్దామా?" ఉత్సాహపడ్డాన్నేను.

"ఒద్దొద్దు" కంగారుపడుతూ "మనింట్లో నేసేప్పుడు చూద్దువులే" అన్నది కరుణ. మళ్ళీ నా మౌనాన్ని ఏ విధంగా అర్థంచేసుకుందోగానీ చెప్పసాగింది మెల్లిగా

"ఏంలేదు వర్షా, శేషన్నా వాళ్ళ పరిస్థితి మరీ ఘోరంగా ఉండాది. ఒకప్పుడు పముజుల వీరాస్వామి అంటే ఊరంతటికీ గొప్ప. ఆ వీరాస్వామి కొడుకే ఈ శేషన్న. ఈరోజున భార్యా భర్తలిద్దరికీ ఉండేది ఒకటే గుడ్డ. శేషన్న గుంటలో దిగితే ఆ గుడ్డ తీసి భార్యకిస్తాడు. ఆమె గుంటలో దిగితే శేషన్న బయటికొస్తాడు. ఇదీ వాళ్ళ పరిస్థితి" కళ్ళనీళ్ళు పెట్టుకుంది కరుణ.

ప్రపంచానికే బట్టకట్టడం నేర్పిన నేతన్నకి ఒంటిని కప్పుకోడానికి నూలుపోగు లేదు. "హూ" భారంగా నిట్టూర్చాను.

ఆ తర్వాత ఇద్దరం ఏం మాట్లాడుకోలేదు చాలాసేపటిదాకా.

* * *

కిష్టయ్యా... ఒకిష్టయ్యా... మళ్ళీ ఈ పొద్దు యింకొకరు ఉరేసుకుని చచ్చిపోయ్యా డంట..." పేపరు పట్టుకుని అరుస్తూ వచ్చాడతడు, చిరుచీకట్లు విచ్చుకోకముందు...

చప్పున లేచి కూర్చున్నాన్నేను .

నిన్న అక్కడెక్కడో కరీంనగర్ వద్ద చేనేత కార్మికుడొకడు అప్పులతోనూ, ఆకలితోనూ బతకలేక సకుటుంబంగా విషంతాగి మరణించిన సంగతి పేపర్లో చూసి నిన్నంతా యిరుగూ, పొరుగూ కలిసి కిష్టయ్యతోనూ, భాస్కర్తోనూ చర్చించారు...

ఎక్కడచూసినా చేనేత కష్టాలు ఒకేలావున్నాయంటూ కష్టసుఖాలు కలబోసుకున్నారు. ఒక్కొక్కరూ తగినంతపని లేకా, గిట్టుబాటు ధరల్లేకా ఏవిధంగా అప్పులపాలయిందీ తలపోసు కున్నారు .

మళ్ళీ తెల్లారకముందే మరో నేత కార్మికుడి మరణవార్త.

"అయినా కిష్టయ్యా మనూళ్ళో ఎన్ని కుటుంబాలుండేయి కైకాలోళ్ళవి. అందరూ చెట్టుకొకరూ, పుట్టకొకరూ అయిపోతిరి... పొట్టకూటికి లేకుండా ఎంతకాలం పని చేస్తారు?"

కుటుంబాల, కుటుంబాలుగా పూరొదిలి వెళ్ళిపోయిన సహనేతగాళ్ళని తలుచుకుంటూ వారి గుండెల్లో తడి...

ఎవరి గుండెల్లో ఎన్ని విషాదాలు గూడుకట్టుకున్నాయో ఒకరివెంట మరొకరు ఒకదారి ఏర్పడ్డట్లుగా ప్రయాణం కడ్తున్నారు...

"మంత్రి ఏవన్నాడో చదివినా..." పేపరు చూస్తూనే ప్రస్తావించాడు కిష్టయ్య..." ఈ చేనేత పనోళ్ళంతా ప్రభుత్వం యిచ్చే డబ్బులకోసమే ఆత్మహత్యలు చేసుకుంటున్నారంట. ప్చ్..."

"ఆకలి ఎట్టుంటాదో తెలిస్తే యిట్టా మాట్లాడతారంట్రా ఎదవ నాయాళ్ళు?" చుట్ట నోట్లో పెట్టుకుని కొరుకుతూ అన్నాడు పెద్దాయన.

ఎండుటాకుల్లా రాలిపోతూన్న నేతన్నల మీద మన నేతలు యిటువంటి హీనమైన వ్యాఖ్యలెందుకు చేస్తున్నారో అర్థంకాదు... ప్చ్... ప్రపంచానికే బట్టకట్టడం నేర్పిన ఐదువేల ఏళ్ళనాటి మన భారతీయ సంస్కృతి సిగ్గుతో తలదించుకుంది.

పెద్దాయన మళ్ళీ నోరువిప్పాడు.

"ఆ రామారావు ముఖ్యమంత్రిగా వున్నప్పుడే నయం. జనతావస్త్రాలు అన్జెప్పి మన చేనేతపనికి అడ్వాన్సులిచ్చి పని కల్పించాడు. ఆయన పోయినాడు. యిప్పుడుండే వోళ్ళు మన మంచీ చెడ్డా చూడకపోతిరి"

"అయినా రోజూ ఎంతమంది నేతన్నలు ఆకలితో చచ్చిపోతుండారో చూడు. ప్చ్... "

చేనేతరంగం మన ఆర్థికవ్యవస్థకు రెండో గుండె అన్న మహాత్మాగాంధీ మాటలు, గుర్తొచ్చి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి నాకు. ప్రపంచానికే తలమానికమైంది మన చేనేత పరిశ్రమ. ఇవాళ ఆకలి కడుపుల్తో, అప్పుల్తో చేనేత కార్మికుల ఆత్మహత్యల పరంపర...

మామూలుగా అయితే నేనీ వార్తలు పేపర్లో చదివో, టి.వి.లో చూసో ఛానల్ మార్చే సుండే దాన్ని. ఇప్పుడు ఈ కుటుంబంతో కలిసి యిక్కడ యిలా చూస్తూంటే నా నరాల్ని ఎవరోలాగి వదిలినట్లుగా అయింది .

"అక్కా... లే... యివ్వాళ శివాలయానికి వెళ్దామనుకున్నాం" తొందరపెట్టాడు రాంప్రసాద్ కరుణ వారిస్తున్నా వినకుండా.

దిగులు దిక్కున తెల్లవారింది.

* * *

"కరుణ చాలా తెలివైంది... కాలేజీలో చేరిస్తే బావుంటుందేమో" ఏటిఒడ్డున శివా లయం గట్టున కూర్చుని నీళ్ళలోకి రాళ్ళు విసురుతున్నాడు భాస్కర్... కరుణ, రాంప్రసాద్, పక్కింటి మునిరాజా ఇసుకలో పరిగెడ్తూ ఆడుకుంటున్నారు... వాళ్ళకేసి చూస్తూ కరుణని గురించి ప్రస్తావించాన్నేను.

దూరంగా వూళ్ళో పూరిళ్ళకవతల సూర్యుడు రంగులు కుమ్మరిస్తూ వెలుగుతున్నాడు. నీరెండ, కుంచెతో సృష్టి చిత్రాన్ని ఆవిష్కరిస్తోన్న చిత్రకారుడిలా వుంది.

భాస్కర్ మాట్లాడకపోవడం చూసి రెట్టించాన్నేను.

మేమిద్దరం కూర్చున్న గట్టుచివర్లో గులకరాళ్ళ మీద ఏటి జాలు గలగలమంటూ వింతశబ్దంతో పారుతోంది.

"నిజమేఁ కరుణ తెలివయిందే... అమ్మానాన్నా తనని చదివించలేదని తిట్టుకుంటూ కూర్చోక టెయిలరింగ్, పెయింటింగూ నేర్చుకుంది. సర్టిఫికేట్ కూడా వుంది. షాప్ వోపెన్ చేయాలని కోరిక. లోనుకి అప్లైచేసి ఆఫీసుల చుట్టూ తిరగడమే తప్ప ఫలితం కన్పించడంలేదు. నేను ఉద్యోగంలో చేరితే తన పెళ్ళి నా మొదటి బాధ్యతవుతుంది."

బాధ్యతగా చెప్తున్నాడో, బరువుగా అంటున్నాడో అర్థంకాలేదు భాస్కర్ని చూస్తుంటే.

"జాగ్రత్త... జాగ్రత ప్రేమిస్తున్నావా? ప్రేమని నమ్మబాకు... ప్రభుత్వాన్ని అసలే నమ్మ బాకు... ప్రేమ, లేని ఆస్తుల్ని పొందాలంటే... ప్రభుత్వం మన ఆస్తులన్నిట్నీ ప్రైవేటు వ్యక్తుల కమ్మేస్తుంది... నమ్మబాకు నమ్మబాకు" వేపమండల గుత్తితో నా మెడ మీద రాస్తూ అతడు నా మీదిమీదికొచ్చాడు. గుండె ఝల్లుమంటూ బెదిరినట్లుగా భాస్కర్ పక్కకి జరిగాన్నేను.

వేపాకు మా మొహాలమీద ఝాడిస్తూ అవే మాటల్ని మళ్ళీమళ్ళీ గొణుక్కుంటూ నీళ్ళలోకి దిగి కరుణ వాళ్ళున్న వైపుగా నడిచాడతడు. తేరుకోని భయంతో ప్రశ్నార్థకంగా భాస్కర్ కేసి చూశాన్నేను.

అతడి కళ్ళల్లో వూరిన నీళ్ళని ప్రయత్నంమీద వెనక్కి నెడుతూ చెప్పాడు భాస్కర్ "మా అన్న"

స్థాణువయ్యాన్నేను.

"అవును... ఎమ్మెస్సీ చదివి ఉద్యోగం కోసం తిరిగితిరిగి చివరికి ఒక ఫ్రిడ్జ్‌ల కంపెనీలో చిన్న పనికి కుదిరాడు. వదినా, తనూ తిరుపతిలో వుండేవాళ్ళు.

జీతం చిన్నదీ... వదిన ఆలోచనలూ, ఆశలూ చాలా పెద్దవి... పక్కవాళ్ళలా చీరలూ, నగలూ లేవనే అసంతృప్తి. ఇంటిని బోలెడన్ని వస్తువులతో నింపాలన్న ఆతృత... ఇద్దరూ ఎప్పుడూ ఘర్షణపడుతూ వుండేవాళ్ళు. అన్న కష్టపడి వదిన అడిగిన చీర కొనిపెట్టినా ఆ గొడవ అంతటితో ఆగేదికాదు. మరొక వస్తువుకోసం తపన.

ఒక విధంగా అది ఆమె తప్పుకూడ కాదేమో అన్పిస్తుంది యిప్పుడాలోచిస్తుంటే... మనకి అవసరమైనవీ అనవసరమైనవీకూడ సరుకులు బజార్లోకొచ్చి మనల్ని వూరిస్తున్నాయి. మన ఆలోచనలనీ, జీవితాల్నీ పక్కదారి పట్టిస్తున్నాయి..."

ప్చ్ఁ సరుకుల విశ్వరూపాన్ని ప్రజల మెదళ్ళలోకి జొప్పిస్తోన్న ఈ ప్రచారసాధనాల మీద విరక్తి కలిగింది.

"మరి మీ అన్నయ్య యిలా?"

"ఏముందీ యిలా జీవితంతో ఘర్షణ పడుతూన్న సమయంలోనే అన్న పని చేస్తూన్న కంపెనీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. దాంతో వున్న ఆధారం కూడ తెగిపోయింది. వదిన భర్తనీ, కొడుకునీ వొదిలి మంచి జీవితాన్ని (?) వెదుక్కుంటూ వెళ్ళిపోయింది. అప్పట్నుండీ అన్న జీవితమే భ్రమించిపోయింది. అప్పట్నుండీ యిలాగే తిరుగుతున్నాడు. ఆకలేస్తే యింటి కొస్తాడు. లేదంటే యిదిగో ఈ శివాలయంవద్దే... ఎంతో ప్రయత్నించి చూశాం... ప్చ్‌ ఇక యిదింతే..." భాస్కర్ గొంతులోని విషాదం నన్ను కదిలించింది.

హఠాత్తుగా నాకు తరచుగా వచ్చి స్వర్గలోకాల్లో విహరింపజేస్తూన్న కల గుర్తొచ్చింది. అదే కల అన్నిసార్లు ఎందుకొస్తుందో ఎంతాలోచించినా అర్థంకాదు.

ఆ కలలో భవంతులు తప్ప పూరిళ్ళులేవు. నిజంగా అటువంటి రాజ్యమొకటి వుంటుందా? వుంటే ఎంత బావుండును. భాస్కర్‌కీ, నాకూ నడుమ వున్న ఈ అంతరాలు హఠాత్తుగా మాయమైపోతే ఎట్లా వుంటుంది? అప్పర్‌మిడిల్ క్లాసులో జీవిస్తోన్న నేను యిటువంటి జీవితంతో రాజీపడగలనా?

శూన్యంలోకి చూస్తూన్న నాచేతి మీద చేయివేసి ప్రేమగా, యిష్టంగా నొక్కాడు భాస్కర్ నవ్వుతూ....

ఉలిక్కిపడి అతడి కేసి చూశాన్నేను .

అస్తమిస్తోన్న సూర్యుడి కిరణాలు భాస్కర్ మొహం మీద కాషాయవర్ణంలో మెరుస్తున్నాయి. మూడేళ్ళ మా పరిచయంలో భాస్కర్ ఎప్పుడూ నన్నలా ముట్టుకోలేదు. ప్రేమ ప్రేమంటూ నేను వెంటపడినా తను దూరదూరంగానే వుండేవాడు.

నాకెందుకో హఠాత్తుగా నేనెవరో గుర్తురాలేదు.

మొత్తం అస్థిత్వాన్ని మర్చిపోయినట్లుగా వుంది. నేను నడవాల్సిన దారి కన్పించడంలేదు.

'వర్షా' పిలిచాడు భాస్కర్ "మా యిల్లు, నా తలిదండ్రులూ, కుటుంబం , బాధ్యతలూ, మా లోక్లాస్ జీవితాలూ యివన్నీ చూపించడానికే నిన్నిక్కడికి రమ్మన్నాను... నీకిదంతా చాలా వింతగా వుంది కదూ" మెల్లిగా పైకి లేచాడతడు.

అవునూ, కాదూ అని సమాధానం చెప్పకుండా నేనూ లేచి నిల్చున్నాను. దూరంగా కరుణ, రాంప్రసాద్, మునిరాజా మావైపుగా నడిచి వస్తున్నారు.

శివాలయం ముందు కూర్చున్న ఒక వృద్ధుడికి పదిరూపాయలు తీసి యిస్తూ "బాగున్నావా మామా?" అంటూ పలకరించాడు భాస్కర్. ఎముకలగూడుకి చర్మం అంటించి నట్లుగా వున్నాడతడు.

"బాగుండాను భాస్కరయ్యా. నువ్వెప్పుడొచ్చా ?"

మోకాళ్ళదాకా పంచె, చేతులున్న మాసిన బనీనూ, పండబారిన నేరేడుపండులా వున్న ఆ వృద్ధుణ్ణీ, భాస్కర్నీ మార్చిమార్చి చూస్తున్నాన్నేను...

కొద్ది దూరంలో నిల్చుని కరుణ, మునిరాజా, రాంప్రసాద్ ముగ్గురూ అప్పుడు ఆడిన ఆటలో మొండితనాన్ని గురించి వాదించుకుంటున్నారు.

అప్పటికి సూర్యుడు పూర్తిగా పడమటికొండల్లోకి కుంగిపోయాడు.

"అతడి పేరు చిన్నోడు... " మా వద్దకి నడుస్తూ చెప్పాడు భాస్కర్.

"కానీ చాలా పెద్దోడిలా కన్పిస్తున్నాడే " భాస్కర్తోపాటు అడుగులేస్తూ నవ్వాన్నేను.

"చిన్నోడు... ఒకప్పుడు మా నాయినకి ధీటుగా రకరకాల జరీచీరలు నేసినోడు. ఎటువంటి చదువుసంధ్య ల్లేకపోయినా కళ్ళు చెదిరే డిజైన్లు, అద్భుతమైన రంగుల కలనేతలు రూపొందించేవాడు. అమిత చీపుగా అందుబాటులోకొచ్చిన విదేశీవస్త్రాల ధాటికి తట్టుకోలేక మావూరి నేతగాళ్ళంతా పొట్ట చేతబట్టుకుని వెళ్ళిపోయారు. వెళ్ళలేనివాళ్ళు పెద్ద రెడ్లవద్ద సేద్దిగాళ్ళుగా, కూలోళ్ళుగా మారిపోయ్యారు. చివరికి ఆ కూలిపని కూడ చేయలేక శివాలయం ముందు కూర్చుని అడుక్కుంటున్నాడు చిన్నోడు. ఆత్మహత్య మాత్రం చేసుకోలేదు" భాస్కర్ గొంతు వొణికింది.

'హుఁ' నిట్టూరుస్తూ "ఎందుకిట్లా అయిందంటావ్?" ప్రశ్నించాన్నేను.

"మామూలే... మిషన్ల రాకతో చేతివృత్తులు ఎక్కడ నిలుస్తాయి. అదీకాక రాజీవ్‌గాంధీ జౌళి విధానం మూలంగా చేనేత బాగా దెబ్బతింది. అప్పుడిలాగే నేతన్నల ఆత్మహత్యల పరంపర కొనసాగింది. ఆ తర్వాత రామారావు ప్రభుత్వంలో కొంత నయం... చేనేత కార్మికులకు ఉపాధి దొరికింది. మళ్ళీ ఇప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రపంచబ్యాంకు ఆదేశిత విధానాల మూలంగా నేతపని వూపిరి ఆగిపోతోంది"

వాతావరణం బరువెక్కిపోయింది. అందరం మౌనంగా ముందుకి అడుగులేస్తున్నాం. శివాలయం కాంపౌండు గోడనానుకుని వున్న నేరేడుచెట్టు మీది నుండి చల్లని గాలి తెమ్మెర మమ్మల్ని రాసుకుంటూ వెళ్ళింది.

"రేపుదయం వూరెళ్దామనుకుంటున్నాను" చెప్పాన్నేను చాలా మెల్లిగా, తాపీగా.

చప్పున కళ్ళు చికిలిస్తూ నా కళ్ళల్లోకి చూశాడు భాస్కర్. ఆ చూడ్డంలో అతడి గుండె ల్లోని బాధని దాచలేకపోయాడు. అయినా 'ఏం నిర్ణయించుకున్నా'వంటూ అతడు నన్ను ప్రశ్నించలేదు. నిజానికతడు ఆ ప్రశ్నకి జవాబు వెతుక్కోనవసరం లేనట్లుగా వున్నాడు.

* * *

తెల్లవారు ఝామున మూడయింది.

ఎక్కడో పొలాలమీది కాపలాకుక్కల అరుపులతో చప్పున మెలకువొచ్చింది నాకు. చప్పుడు కాకుండా లేచి మెల్లగా వెనక వసారాలోకెళ్ళి బావిగట్టు మీద కూర్చున్నాను.

మళ్ళీ అదే కల. అవే ఆకాశహర్మ్యాలు. అదే లైట్ల కాంతి. అవే సిమెంటురోడ్లు. అవే విదేశీ కార్లు. అంతా అద్భుతమైన దృశ్యం.

అయితే కల వచ్చిన యిన్నిసార్లుగా గుర్తించని ఒక విషయం పసిగట్టానీసారి.

ఇంత అద్భుతమైన రాజ్యంలోనూ ఎక్కడా మనుషులే లేరు. అంతా ఏమయిపోయారో అర్థంకాక పరికిస్తే సుదూరంగా ఒకచోట రకరకాల కరెన్సీ కాగితాలు ఎత్తుగా కుప్పబోసి వున్నాయి. ఆ రాశిచుట్టూ వందల, వేల, లక్షల జనాలు నిల్చుని గుంజిళ్ళు తీస్తున్నారు.

అందమైన ఆ భవంతుల ముంగిళ్ళలో చిత్రంగా పచ్చగడ్డి బదులు ఎండుగడ్డి పెరుగుతోంది.

రంగు రంగుల కల చెదిరిపోయి నేనూ, చీకటీ మిగిలిపోయాం.

'కథాకేళి' నెల్లూరు జిల్లా రచయితల సంఘం